జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు


ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 156 | ఆదివారం 2 నవంబర్– 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## కాశీబుగ్గ తొక్కిసలాటపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట
- 9 మంది భక్తుల మృతి
- ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- పీఎం జాతీయ సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఆర్థిక సాయం
- గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం



(సందేశం టైమ్స్) ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మరణించిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ప్రధాని, బాధితులకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట అత్యంత బాధాకరం. తమ సన్నిహితులను, కుటుంబసభ్యులను కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాశీబుగ్గ ఘటనలో బాధ్యులపై చర్యలు తప్పవు: సీఎం చంద్రబాబు



శ్రీకాకుళం, నవంబర్ 1(సందేశం టైమ్స్) శ్రీ సత్యసాయి జిల్లా, నవంబర్ 1: కాశీబుగ్గలో జరిగిన విషాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. జిల్లాలోని కదిరి నియోజకవర్గం తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి ప్రజావేదికలో దీనిపై మాట్లాడుతూ.. కాశీబుగ్గపట్నంలో ఒక ప్రైవేటు వ్యక్తి వెంకటేశ్వర స్వామి దేవాలయం కట్టారని.. కార్తీకమాసం సందర్భంగా చాలా మంది దర్శనానికి వెళ్లారని అన్నారు.

మిగతా 2లో...

## కాశీ బుగ్గ ఘటనపై పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి

శ్రీకాకుళం, నవంబర్ 1(సందేశం టైమ్స్) శ్రీకాకుళం జిల్లాలో పెను విషాదం చోటు చేసుకుంది. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 10 మంది మృతిచెందారు. మృతుల్లో 9 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కార్తీక మాసంలో వచ్చే ఏకాదశి కావడంతో ఆలయానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఫస్ట్ ఫ్లోర్‌లోని స్వామివారి దర్శనం కోసం మెట్లు ఎక్కుతుండగా ఈ ఘటన జరిగింది. భక్తుల రద్దీతో రెయిలింగ్ ఊడిపడింది. ఈ క్రమంలో భక్తులు ఒకరిపై ఒకరూ పడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. సహాయక



చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి..



శ్రీకాకుళం, నవంబర్ 1(సందేశం టైమ్స్) శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందిస్తూ, "కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు మరణించారన్న వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదం గురించి తెలియగానే అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించాం. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని సూచించాం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ

## టీమ్ స్పిరిట్.. టెక్నాలజీతో మొంథాపై విజయం: సీఎం చంద్రబాబు

- మొంథాతుపాన్ యోధులను సత్కరించిన సీఎం చంద్రబాబు
- టీమ్ స్పిరిట్‌తోనే తుపాన్ నష్టాన్ని తగ్గించగలిగామని వెల్లడి
- టెక్నాలజీ, ఏఐసాయంతో విపత్తును ఎదుర్కొన్నామన్న సీఎం
- భవిష్యత్ కార్యాచరణ కోసం మాన్యువల్ రూపొందిస్తామని ప్రకటన
- గ్రామ స్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు
- డ్రోన్ల ద్వారా పలువురి ప్రాణాలు కాపాడామన్న ముఖ్యమంత్రి

నవంబర్ 1(సందేశం టైమ్స్) మొంథా తుపాన్‌ను టీమ్ స్పిరిట్, ఆధునిక టెక్నాలజీతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో పెను నష్టాన్ని నివారించగలిగామని ఆయన ప్రశంసించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తుపాన్ సమయంలో అద్భుతమైన పనితీరు కనబరిచిన 137 మంది 'మొంథా



ఫైటర్ల'ను ఆయన సత్కరించి, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

2 లో..

## పోలవరం ప్యాకేజీపై మంత్రి కీలక ప్రకటన



మిగతా 2లో...

ఏలూరు, నవంబర్ 1(సందేశం టైమ్స్) పోలవరం ప్రాజెక్ట్‌ను ధ్వంసం, విధ్వంసం చేసింది వైసీపీ అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శలు గుప్పించారు. శనివారం వేలేరుపాడులో పోలవరం నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... పోలవరం నిర్వాసితుల ద్రోహి జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## వైద్య సిబ్బందికి అపూర్వ అవకాశం, త్వరలో టీటీడీ శ్రీవారి వైద్యసేవ



తిరుమల, నవంబర్ 1(సందేశం టైమ్స్) తిరుమల శ్రీవారి వైద్య సేవలు ఇక నుంచి మరింత విస్తరించబోతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానంలోని అన్ని హాస్పిటల్స్‌లో శ్రీవారి వైద్యసేవను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం శ్రీవారి సేవలకు వాలంటర్లకు అవకాశం కల్పిస్తున్న తరహాలోనే డాక్టర్లు, నర్సులు, హాస్పిటల్ సిబ్బందికి కూడా అవకాశం ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. అవసరమైతే ఇందుకోసం శిక్షణ ఇచ్చి మరీ వారి సేవలు వినియోగించుకోవాలని చూస్తున్నారు.

మిగతా 2లో...

## ఢిల్లీ పేరుమార్చండి: అమిత్ షా, రేఖా గుప్తాలకు బీజేపీ ఎంపీ లేఖ

### 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని లేఖలో డిమాండ్ చేసిన ఎంపీ

దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ 'ఇంద్రప్రస్థ'గా మార్చడం ద్వారా భారతదేశ చరిత్ర భవిష్యత్తు తరాలకు తెలుస్తుందన్న ఎంపీ

ఢిల్లీ, నవంబర్ 1(సందేశం టైమ్స్) ఢిల్లీ పేరు మార్చాలని కోరుతూ బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్‌వాలా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఢిల్లీ పేరు మార్చాలనే డిమాండ్లు ఈ మధ్య బాగా వినిపిస్తున్నాయి. ఈ నగరం పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని విశ్వహిందూ పరిషత్ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. తాజాగా ఒక ఎంపీ లేఖ రాయడం చర్చనీయాంశమైంది.



మిగతా 2లో...

మొదటి పేజీ తరువాయి

## కాశీబుగ్గ ఘటనలో బాధ్యులపై చర్యలు తప్పవు: సీఎం చంద్రబాబు

దీనిపై పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని.. పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే బందోబస్తు పెట్టేవాళ్ళమని చెప్పారు. తొక్కిసలాట ఘటనలో పది మంది చనిపోయారని.. ఇది చాలా బాధాకరమని ఆవేదన చెందారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా బాధాకరమని.. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు.

తుపానులో ముందస్తు ప్రణాళిక ద్వారా ఎక్కువ ప్రాణ నష్టం లేకుండా చూడగలిగామని.. తొక్కిసలాటలో ఇంతమంది మృతి చెందటం బాధాకరమన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని... విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో జరగడానికి వీలు లేదన్నారు. తొక్కిసలాటలో చనిపోయిన కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దేవుడు సన్నిధిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని బాధపడ్డారు. కాశీబుగ్గలో జరిగిన ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## పోలవరం ప్యాకేజ్‌పై మంత్రి కీలక ప్రకటన

పోలవరం ప్రాజెక్టు మొదటి దశకు లక్షా 99 వేల ఎకరాలు అవసరం ఉందని.. ఇప్పటి వరకు 86, 900 ఎకరాలు సేకరించామని తెలిపారు. ప్రాజెక్టు రెండో దశకు 67,600 ఎకరాలు అవసరం ఉండగా.. ఇప్పటి వరకు 29,700 ఎకరాలు సేకరించినట్లు వెల్లడించారు.

సీఎం చంద్రబాబుగా ఉండగా మూడుసార్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అందజేసినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో ఒక్క రూపాయి కూడా ప్యాకేజ్ ఇవ్వలేదని మండిపడ్డారు. 'మీ డబ్బులు మీకు ఇవ్వడానికి కూడా మానవత్వం లేని వ్యక్తి జగన్' అంటూ మంత్రి దుయ్యబట్టారు. పోలవరం నిర్వాసితుల కోసం కాలనీలు నిర్మించడానికి ఒక్క ఇటుక కూడా ఇవ్వలేదన్నారు. 739 కోట్ల రూపాయలతో 49 కొత్త కాలనీల నిర్మాణానికి టెండర్లు పిలిచామని గుర్తుచేశారు. అయితే కాలనీలు నిర్మించకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మొద్దు నిద్రపోయారని ఎద్దేవా చేశారు. 17,200 కుటుంబాలకు కొత్తగా జనవరి నుంచి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అమలు చేయబోతున్నామని ప్రకటించారు.

## టీమ్ స్పిరిట్.. టెక్నాలజీతో మొంథాపై విజయం: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ప్రతి సంక్షోభం మనకు ఒక అవకాశం. ఈసారి తుపాన్ నష్టాన్ని తగ్గించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ప్రజల తరఫున ధన్యవాదాలు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తుందనడానికి ఈ విజయమే నిదర్శనం. ఈ అనుభవాన్ని భవిష్యత్తులో విపత్తుల నిర్వహణ కోసం ఒక మాన్యువల్‌గా రూపొందిద్దాం" అని పిలుపునిచ్చారు.

టెక్నాలజీతో నష్ట నివారణ

తుపాన్ల సమయంలో టెక్నాలజీ వినియోగంపై చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) మోడల్స్, 'అవేర్ 2.0' వ్యవస్థ ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. మానిటరింగ్, అలెర్ట్, రెస్క్యూ, పునరావాసం, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ అనే ఐదు సూత్రాల ఫార్ములాతో నష్టాన్ని తగ్గించగలిగాం. రియల్ టైమ్‌లో హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేశాం" అని వివరించారు. సమర్థ నీటి నిర్వహణతో రాయలసీమలో కరువును జయించినట్లే, టెక్నాలజీతో కోస్తాంధ్ర తుఫాన్ల ప్రభావాన్ని తగ్గిస్తున్నామని అన్నారు.

క్షేత్రస్థాయిలో సమష్టి కృషి

తుపాన్ సమయంలో చేపట్టిన సహాయక చర్యలను ముఖ్యమంత్రి కొనియాడారు. "డ్రోన్ల సహాయంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడాం. పర్చూరు వాగులో చిక్కుకున్న షేక్ మున్నాను, ఒక ప్రార్థనా మందిరంలో ఉన్న 15 మందిని రక్షించిన విషయాన్ని గుర్తుచేశారు. ముందస్తుగానే 602 డ్రోన్లను సిద్ధం చేశామని, కాలువల్లో పూడిక తీయడం వల్ల భారీ వర్షాలకు కూడా వరద ముప్పు తగ్గిందని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు సీఎస్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అంతా కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది" అని తెలిపారు.

త్వరలో గ్రామ స్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థ

త్వరలోనే రాజధాని నుంచే నేరుగా గ్రామ స్థాయి వరకు హెచ్చరికలు పంపే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, మంత్రులు అనిత, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాశ్, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పేరుమార్చండి: అమిత్ షా, రేఖా గుప్తాలకు బీజేపీ ఎంపీ లేఖ

ఢిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చడం ద్వారా అది చారిత్రక, సాంస్కృతిక, నాగరికత మూలాలను ప్రతిబింబిస్తుందని ప్రవీణ్ ఖండేల్‌వాలా పేర్కొన్నారు. నగరంలోని పాత రైల్వే స్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయాల పేర్లను కూడా మార్చాలని బీజేపీ ఎంపీ ఆ లేఖలో కోరారు. దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రయాగ్‌రాజ్, అయోధ్య, ఉజ్జయిని, వారణాసి వంటి నగరాల పేర్లు వాటి మూలాలకు అనుగుణంగా ఉన్నాయని, అలాంటప్పుడు దేశ రాజధాని పేరు కూడా అలా ఎందుకు ఉ ండకూడదని ఆయన ప్రశ్నించారు. నగరం పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చడం ద్వారా భారత దేశ చరిత్ర, సంస్కృతి, పాండవుల నీతి, ధర్మం భవిష్యత్తు తరాలకు తెలియజేసిన వారమవుతామని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీ పేరు మార్పునకు సంబంధించిన లేఖను అమిత్ షాతో పాటు ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు కూడా పంపించానని ప్రవీణ్ ఖండేల్‌వాలా తెలిపారు.

## వైద్య సిబ్బందికి అపూర్వ అవకాశం, త్వరలో టీటీడీ శ్రీవారి వైద్యసేవ

తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. దేవస్థానం అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం ఈ రివ్యూ మీటింగ్ లో పాల్గొన్నారు.

శ్రీవారి వైద్య సేవలకు అవసరమైన ప్రత్యేక సెల్, విధివిధానాలు రూపొందించాలని సింఘాల్ ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యంగా అశ్విని, ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల ఆసుపత్రుల్లో వాలంటరీ వైద్యుల సేవలు వినియోగించుకోవాలని ఆయా విభాగాల డైరెక్టర్లకు ఈవో సూచించారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష







సూర్యాపేట, నవంబర్ 1, 2025 – ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.

శనివారం నాడు ఆయన హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షించారు.

### ఓటర్ల వర్గీకరణ మరియు నిర్ధారణ

**ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, నియోజకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితాను మ్యాపింగ్ చేసి ఓటర్లను 4 కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు:**

**కేటగిరీ A: 1987 కంటే ముందు జన్మించి, 2002 మరియు 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు.**

**కేటగిరీ B: 1987 కంటే ముందు జన్మించి, 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు.**

**కేటగిరీ C: 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి, 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు.**

**కేటగిరీ D: 2002-2007 మధ్యలో జన్మించిన వారు.**

ఆయన మొదట కేటగిరీ A జాబితాను బీఎల్‌ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేటగిరీ C, కేటగిరీ D లలోని ఓటర్లను కేటగిరీ A కు మ్యాపింగ్ చేసే ప్రక్రియను మెరుగుపరచాలని సూచించారు.

### దరఖాస్తుల విచారణ మరియు బీఎల్‌ఓ నియామకం

ఓటర్ లిస్టుల జాబితాకు సంబంధించిన ఫారాలు 6, 7, 8 లను త్వరగా ఎంక్వయిరీ చేసి ఏడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే, అన్ని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలను నియమించాలని మరియు బీఎల్‌ఓలు యాప్ ద్వారా ఎప్పటికప్పుడు వివరాలను పొందుపరచాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్‌లాల్ పవార్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, సూర్యాపేట ఎమ్మార్వో కృష్ణయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్, ఎలక్షన్ డీటీ వేణు తదితరులు పాల్గొన్నారు.జారీ చేసిన వారు: జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట

# ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్




(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1నవంబర్ రాష్ట్ర న్యాయ సేవా అధికారం ఆదేశాల మేరకు ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికారం చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవానీ చంద్ర గారు తెలిపారు.ఈ సందర్భంగా శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, సమన్వయ చర్యలు, కేసుల గుర్తింపు అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి జిల్లా న్యాయ సేవా అధికారి కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య, జిల్లా పోలీసు అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు లైజన్ అధికారులు, న్యాయ సేవా అధికారం సిబ్బంది హాజరయ్యారు.చైర్‌పర్సన్ భవానీ చంద్ర మాట్లాడుతూ, లోక్ అదాలత్ ప్రజలకు వేగవంతమైన, తక్కువ వ్యయంతో, సయోధ్య పద్ధతిలో న్యాయం అందించే వేదిక అని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడం, ప్రజలకు శాంతియుత పరిష్కారం లభించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రతి పోలీస్‌స్టేషన్ స్థాయిలో సయోధ్య సాధ్యమైన కేసులను ముందుగానే గుర్తించి జాబితాలు సిద్ధం చేయాలని, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్, కుటుంబ వివాదాలు, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ కేసులు, చిన్నపాటి సివిల్ సూట్లను ప్రాధాన్యతగా గుర్తించాలని సూచించారు. మహిళా, కుటుంబ, పొరుగు వివాదాల విషయంలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం సాధ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.పోలీసు శాఖ సమన్వయం లేకుండా లోక్ అదాలత్ విజయవంతం కాదని స్పష్టం చేశారు. ప్రజలకు లోక్ అదాలత్ సౌకర్యాలు, ప్రయోజనాలు తెలియజేయడం పోలీసుల బాధ్యత అని చెప్పారు. ప్రతి స్టేషన్ స్థాయిలో ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను లోక్ అదాలత్ ద్వారా తమ కేసులు పరిష్కరించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.పోలీసు అధికారులు స్పందిస్తూ, గరిష్టంగా సయోధ్య సాధ్యమైన కేసులను గుర్తించి లోక్ అదాలత్‌కు పంపించేందుకు, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.చివరగా చైర్‌పర్సన్ భవానీ చంద్ర పోలీసు శాఖకు ధన్యవాదాలు తెలుపుతూ, జిల్లా న్యాయ సేవా అధికారం తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలు తమ కేసులను సయోధ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలనుకుంటే జిల్లా న్యాయ సేవా అధికారం, సంగారెడ్డి కార్యాలయాన్ని లేదా సంబంధిత కోర్టు న్యాయ సేవా కేంద్రాన్ని సంప్రదించాలనిసూచించారు.

# రాయికోడ్ పోలీస్ స్టేషన్ ని జిల్లా ఎస్పీ తనిఖీ









(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1నవంబర్ సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ శనివారం రాయికోడ్ పోలీస్ స్టేషన్, హద్నూర్ సర్కిల్ కార్యాలయాలను సందర్శించారు. స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ గారు, డీఎస్పీ సైదా నాయక్, ఇన్స్పెక్టర్ హన్మంతులతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. తరువాత స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, సీజ్ చేసిన వాహనాలు, రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను తెలుసుకుని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌హెచ్‌ఓ చైతన్య కిరణ్‌కి ఆదేశించారు. దర్యాప్తులో సందేహాలుంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నేరాలు చోటుచేసుకున్న ప్రాంతాలను స్టేషన్ పార్ట్–II మ్యాప్‌లో నమోదు చేయాలని, ఆస్తి సంబంధిత నేరాలు జరిగే ప్రాంతాలను "క్రైమ్ హాట్‌స్పాట్స్"గా గుర్తించి కఠిన నిఘా ఉంచాలని ఎస్పీ గారు ఆదేశించారు. కేడి, సస్పెక్ట్, రౌడీ షీటర్‌ల కదలికలపై నిరంతర నిఘా ఉంచి, తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే నిషేధిత గంజాయి సాగు, రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వంటి కార్యకలాపాలను అరికట్టేందుకు వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. గ్రామాలపై పూర్తి అవగాహనతో విలేజ్ పోలీసు అధికారులు ముందస్తు సమాచారం సేకరించి, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణకు విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. డైల్100 కాల్స్‌కు బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది తక్షణమే స్పందించి ఘటనాస్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. త్వరిత స్పందనతో నేరాల తీవ్రత తగ్గుతుందని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా వాటి ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది పని తీరు సంతృప్తికరంగా ఉందని అభినందించిన ఎస్పీ గారు, ఎస్‌హెచ్‌ఓ చైతన్య కిరణ్‌తో పాటు సిబ్బందిని ప్రశంసించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పీ గారితో పాటు జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, ఇన్స్పెక్టర్ హన్మంతుపాల్గొన్నారు.

# బోరంచ నల్ల పోచమ్మ ఆలయానికి విరాళం





(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 1 సంగారెడ్డి జిల్లా మనూర్ మండల్ బోరంచ గ్రామంమంజీరా నది ఒడ్డున వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం భక్తులు ముందుకు వస్తున్నారు. ఆలయం వద్ద రేకుల షెడ్డు నిర్మాణం కోసం హైద్రాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బట్టే రోహన్ (తండ్రి: లేట్ బట్టే వెంకటేశం) రూ. 35,000 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సిద్ధయ్య స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విరాళం ఇచ్చిన దాతకు ఆలయ సిబ్బంది శేఖర్ శాలువా కప్పి సన్మానం చేశారు. ఆలయ ఈవో, చైర్మన్, అర్చకులు, సిబ్బంది, భక్తులు, గ్రామ ప్రజలు శ్రీ రోహన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో ఇలాగే మరిన్ని దాతలు ముందుకు వచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులుఆకాంక్షించారు.

# మాజీమంత్రి హరీష్ రావు ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు.

సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గ ప్రతినిధి 1నవంబర్ రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావును అందోల్ బిఆర్ఎస్ నాయకులు శనివారం ఉదయం పరామర్శించారు. ఇటీవల హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మరణించిన విషయం విధితమే శనివారం ఉదయం అందోల్ నియోజకవర్గ పరిధిలోని అందోల్ జోగిపేట మున్సిపాలి పరిధిలో ఉన్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కలిసి కోకపేటలోని హరీష్ రావు నివాసానికి వెళ్లారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం హరీష్ రావును ఓదార్చితన ప్రగడ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వీరభద్ర రావు, మాజీ కౌన్సిలర్ పుర్ర ప్రవీణ సంతోష్, మొగులయ్య, శివకుమార్, తుడుం రాజు, బట్ట చెన్ను, తుంపురవు సురేష్, బబ్లు, బిఆర్ఎస్ నాయకులుపాల్గొన్నారు.



# వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతి వేడుకలకు ఆహ్వానం





(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1నవంబర్ సంగారెడ్డి జిల్లా అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఏకైక బ్రహ్మంగారిమఠంలో మద్విరాజ్ వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతి మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా మఠ నిర్వాహకులు, భక్తులు, దాతలు కలిసి జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి సమస్త జనబాంధువులు, బ్రహ్మంగారి భక్తులు, మఠాభివృద్ధి దాతలు హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించి, బ్రహ్మంగారి కృపకు పాత్రులు కావాలని మఠం ప్రతినిధి గౌరమ్మపిలుపునిచ్చారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



(సందేశం టైమ్స్) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1నవంబర్ సంగారెడ్డి జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎమ్మెన్నార్ వైద్య కళాశాలలో జరిగిన 'నషా ముక్త భారత్ అభియాన్' ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు. సంగారెడ్డిని మాదకద్రవ్య రహిత జిల్లాగా మలచడం లక్ష్యమని తెలిపారు. మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సంక్షేమ అధికారి కె. లలితా కుమారి తెలిపారు. 'నషా ముక్త భారత్ అభియాన్' ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. యువతను మాదకద్రవ్యాల మత్తు నుండి దూరంగా ఉంచేందుకు మిషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా పలు అవగాహన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాలను విక్రయిస్తున్న లేదా వినియోగిస్తున్న వారి వివరాలను హెల్ప్‌లైన్ 14446 కు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా నషా ముక్త భారత్‌కు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. విద్యార్థులు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నాటక కళా ప్రదర్శన చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, జిల్లా యువజనక్రీడాశాఖ అధికారి ఖాసిం బేగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, దివ్యాంగుల శాఖ సిబ్బంది, నషా ముక్త భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా, సహిష్ట, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ తదితరులుపాల్గొన్నారు.

# బీజేపీ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు జన్మదిన శుభాకాంక్షలుతెలిపిన జి మల్లికార్జున



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1నవంబర్ సంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ ఎంపీ బీబీ పాటిల్ జన్మదినం సందర్భంగా వట్టిపల్లి మండల తరపున రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ ప్రేమ్ సాగర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న నాయకుడిగామాజీ ఎంపీ బీబీ పాటిల్ కొనసాగాలని ఆకాంక్షించారు. "ప్రజా సేవ పట్ల అంకితభావం కలిగిన నాయకుడు మాజీ ఎంపీ బీబీ పాటిల్ గారికి ఆయురారోగ్యాలు కలిగి, మరెన్నో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వర్తించాలి" అని జి మల్లికార్జున్, ప్రేమ్‌సాగర్‌తెలిపారు.

# మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన జైపాల్ నాయక్.



(సందేశం టైమ్స్)సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 1నవంబర్తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మరణించిన విషయం విధితవే శనివారం ఉదయం ఆందోల్ నియోజకవర్గం పరిధిలోని చౌటకురు మండల్ గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్ శనివారం కోకాపేటలో హరీష్ రావు నివాసానికి వెళ్లారు. ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం హరీష్ రావును ఓదార్చి తన ప్రగడ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి ఎంపిటిసి సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ నాయక్, అరుణ్ నాయక్ తదితరులుపాల్గొన్నారు.

# కార్తీక మాసం వన భోజన కార్యక్రమం



(సందేశం టైమ్స్) నారాయణఖేడ్ ఇంచార్జి నవంబర్ 1 సంగారెడ్డి జిల్లా రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గం కార్తీక వన భోజనాలు మంజీరా డ్యాంలో జరుగుతున్న ఇట్టి కార్యక్రమానికి లింగాయత్ బంధుమిత్రులందరూ తప్పకుండా హాజరై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్లమల్లికార్జునపాటిల్ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి బర్దిపూర్ ఆశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 1008 మహా మండలాధీశ్వరుడు సిద్దేంద్ర యోగి రాముల వారు మరియు ధనసిరి పీఠాధిపతి 108 శ్రీ వీరేశ్వర స్వామి గారు తంగేడుపల్లి పీఠాధిపతి ష. బ్రహ్మ. 108 శివయోగి శివచార స్వాములవారు వస్తున్నారు కావున భక్తులందరూ వారి ఆశీస్సులు పొందగలరనికోరారు.

# అవయవదానం.. నలుగురికి కొత్త జీవితం



తాడేపల్లి నవంబర్ 1(సందేశం టైమ్స్): బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానానికి కుటుంబీకులు ముందుకు రావడంతో నలుగురు జీవితాల్లో నూతన వెలుగు వచ్చింది. కృష్ణాజిల్లా, గుడివాడకు చెందిన సివిల్ ఇంజినీర్ గుడివాడ హరివిజయకుమార్ (46) తన కుటుంబ సభ్యులతో కలిసి బ్యాంకు పని నిమిత్తం మంగళగిరి వచ్చారు. ఫిట్స్ రావడంతో మంగళగిరిలోని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మెదడులో రక్తస్రావం జరిగిందని గుర్తించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. విజరు కుమార్ భార్య యోగ విష్ణుప్రియ, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లోని వ్యక్తికి అమర్చారు. మరో కిడ్నీని విజయవాడ కామినేని హాస్పిటల్, కళ్లను ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

# లాడ్జీకొచ్చే అందరి వివరాలూ ఇవ్వండి



సత్తెనపల్లి రూరల్ :నవంబర్ 1(సందేశం టైమ్స్): లాడ్జీల్లో సీసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ ఆదేశించారు. సత్తెనపల్లి పట్టణంలోని లాడ్జి నిర్వాహకులు, మేనేజర్లతో ఎస్ఐ సమావేశమయ్యారు. లాడ్జిలో రూమ్ తీసుకున్న ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డులు, ఇతర వివరాలు తీసుకోవాలని చెప్పారు. జూదం, మద్యం పానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జీలను వేదిక చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు గదులు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు 7 గంటల వరకు లాడ్జిలో దిగిన వారి పూర్తిసమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు ఇవ్వాలన్నారు.

# తూర్పు నౌకాదళం కమాండింగ్-ఇన్-చీఫ్‌గా సంజయ్ భల్లా



విశాఖపట్నం, నవంబర్ 1(సందేశం టైమ్స్):తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ పదవీ విరమణ చేయనుండడంతో భల్లాను నియమించారు. ఐఎన్ఎస్ సర్కార్స్ మైదానంలో కొత్త దళాధిపతి సంజయ్ భల్లా సైనిక వందనం స్వీకరించి నేవీ దళాలను సమీక్షించారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లాగ్ ఆఫీసర్లు, వివిధ విభాగాలకు బాధ్యత వహిస్తున్న కమాండింగ్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సంజయ్ భల్లా 1989 జనవరిలో నేవీలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఈ 36 ఏళ్ల సర్వీసులో ఆయన అనేక బాధ్యతలు నిర్వర్తించారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌లో ప్రత్యేక కోర్సు చేసిన తరువాత ఆయన పలు ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకల్లో నిపుణుడిగా వ్యవహరించారు. 2022లో నిర్వహించిన ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్‌లలో టాక్టికల్ కమాండ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టడానికి ముందు నేవల్ హెడ్ క్వార్టర్స్‌లో చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా పనిచేశారు. ఆయన సేవలకు అతి విశిష్ట సేవా మెడల్, నౌ సేనా మెడల్‌ను ప్రభుత్వం బహూకరించింది.

# నీ సంగతి చూస్తా



**నువ్వు నాకు డబ్బులిచ్చావా?**
**బయటికొచ్చాక నాశనం చేస్తా**
**ఫిర్యాదుదారుపై కి'లేడీ' అరుణ**
**కోర్టు ప్రాంగణంలో చిందులు**

విజయవాడ,నవంబర్ 1(సందేశం టైమ్స్):'నువ్వు నాకు డబ్బులిచ్చావా? ఎప్పుడిచ్చావు? కంగారు పడకు.. నీ సంగతి చూస్తా. జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత నిన్ను నాశనం చేస్తా'.. వైసీపీ హయాంలో నెల్లూరు జిల్లాను శాసించిన కి'లేడీ' నిడిగుంట అరుణ విజయవాడ కోర్టుల ప్రాంగణంలో చేసిన వీరంగం ఇది. ఆమెపై ఫిర్యాదు చేసిన వాసిరెడ్డి రమేశ్‌బాబు అనే వ్యక్తి చూసి.. పోలీసుల సమక్షంలోనే అరుణ ఊగిపోయింది. రమేశ్ నుంచి వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 24.50 లక్షలను రెండు విడతలుగా అరుణ వసూలు చేసింది. ఈ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఒంగోలు జిల్లా జైల్లో ఉన్న అరుణను పీటీ వారెంట్‌పై విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి రమేషబాబు అక్కడికి వెళ్లారు. కోర్టు ప్రాంగణంలో అతన్ని చూసిన అరుణ చిందులేసింది. "నువ్వు నాకు డబ్బులిచ్చావా? ఎక్కడిచ్చావు.. కంగారు పడకు.. బయటికి వచ్చిన తర్వాత నీ సంగతి చూస్తా. నిన్ను నాశనం చేస్తా" అంటూ చిందులు వేసింది. దీంతో పోలీసులు ఆమెను వేగంగా కోర్టు హాలు వద్దకు తీసుకెళ్లారు.

# డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

**ఇద్దరు మహిళా అధ్యాపకుల వేధింపులే**
**కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ**
**పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఓ టీచర్ లైంగిక**
**వేధింపుల అంశం ప్రస్తావన**
**వాట్సాప్ చాటింగ్‌ల వివరాలు అందజేత**



ఎం.వి.పి.కాలనీ (విశాఖ పట్నం), నవంబర్ 1(సందేశం టైమ్స్):: విశాఖపట్నం నగరంలోని ఒక డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు ఇద్దరు మహిళా అధ్యాపకుల వేధింపులే కారణమని సహచర విద్యార్థులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు... స్థానిక ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టార్‌లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ కోన సూరిబాబు పెద్ద కుమారుడు సాయితేజ (22) సమతా డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీలో స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు తనను నిత్యం వేధిస్తున్నారని, పరీక్షల్లో జవాబులు బాగా రాసినా మార్కులు వేయడం లేదని, రికార్డులు అధికంగా రాయిస్తున్నారని విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పాడు. అధ్యాపకుల వేధింపులపై యాజమాన్యంతో మాట్లాడేందుకు సాయితేజ తల్లిదండ్రులు, మామయ్య ఉదయం కాలేజీకి వెళ్లారు. అక్కడ ఉండగానే వారు ఇంట్లో ఉన్న సాయితేజతో రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా అతడు స్పందించలేదు. దీంతో ఇంటికి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతిచెంది ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లాస్ టీచర్ లైంగిక అవసరాల కోసం ఒత్తిడి!

కుటుంబసభ్యులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఓ అధ్యాపకురాలి లైంగిక వేధింపుల అంశాన్ని ప్రస్తావించారు. దానికి విద్యార్థితో ఇద్దరు మహిళా అధ్యాపకుల వాట్సాప్ చాటింగ్‌లను జత చేశారు. స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు, క్లాస్ టీచర్ కలిసి తనను వేధిస్తున్నట్టు సాయితేజ పలుసార్లు తమకు చెప్పాడని పేర్కొన్నారు. క్లాస్ టీచర్, స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు మంచి మిత్రులని.. క్లాస్ టీచర్ లైంగిక అవసరాల కోసమే సాయితేజపై స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు ఒత్తిడి తెచ్చే వారని ఆరోపించారు. పరీక్షల్లో బాగా రాసినా మార్కులు వేయకుండా, రికార్డులపై ఉద్దేశపూర్వకంగా సంతకం పెట్టకుండా వేధించేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు సాయితేజ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు క్లాస్ టీచర్ వాట్సాప్ మెసేజ్‌లపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటన దురదృష్టకరమని, విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కళాశాల యాజమాన్యం పేర్కొంది. కాగా, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం, కమ్యూనిస్టు నాయకులు కళాశాల ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. నిష్పాక్షిక విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి హామీ ఇచ్చి పంపించారు.

# అడుగైనా పడని వరికపూడిసెల




మాచర్ల రూరల్ : నవంబర్ 1(సందేశం టైమ్స్)::పల్నాడు రైతుల దశాబ్దాల కలైన వరికపూడిసెల ప్రాజెక్టు పనులు వెంటనే మొదలు పెట్టాలని ప్రాజెక్టు సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు వరికపుడిసెల సాధన సమితి, పల్నాడు రైతులు, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 70 ఏళ్లుగా వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మించాలని ఆందోళనలు జరుగుతున్నాయని, ఇప్పటికి ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేసినా ఆచరణ మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. దీని ఫలితంగా దాదాపు 80 వేల ఎకరాలకు సాగునీరు లేక ఆఖరికి తాగునీరు కూడా లేక ఎగువ పల్నాడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కృష్ణా నదికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రజలకు కూడా తాగడానికి నీళ్లు దొరకడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, రైతులు దాదాపు 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా చుక్క నీరు పడక పంటలు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మరికొందరు రైతులు వలసలు వెళ్లిపోతున్నారని, ఇది కొనసాగితే భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి బి.మహేష్ పల్నాడు శ్రీను, దళిత బహుజన భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, సిపిఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, మాజీ డిప్యూటీ డీఈవో గాదె రామకృష్ణారావు, వీరబ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

# 3న కలెక్టరేట్ వద్ద కౌలురైతుల ధర్నా



పెదనందిపాడు నవంబర్ 1(సందేశం టైమ్స్):కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని సత్వరమే జమ చేయాలని, నూతన కౌలు చట్టాన్ని తేవాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద 3న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ భూ యజమాని సంతకం ఉంటేనే గత ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డు ఇచ్చిందని, కార్డులు వచ్చిన వారికే రైతు భరోసా ఇచ్చిందని, అయితే ఓసీ కౌల్దార్లను మాత్రం ఇందులో మినహాయించిందని అన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి దీన్ని విమర్శించిందని, తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకొనేలా కొత్త చట్టం తెస్తామని, ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముసాయిదా చట్టాన్ని తయారుచేసి వివిధ ప్రాంతాల్లో రైతు సంఘాలు, సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు శాసనసభలో ప్రత్యేకంగా పాత చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు, కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇస్తున్నట్లు ప్రకటించారని, అయితే ముసాయిదాను అసెంబ్లీలో చట్టం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని పంటలకు మద్దతు ధరలు పడిపోయాయని, విత్తనాలు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయని, తగినన్ని ఎరువులు అందుబాటులో లేవని అన్నారు. పెట్టుబడిలు పెరగడం, పంటలకు మద్దతు ధరల్లేకపోవడం వల్ల ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 300 మందికి పైగా కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని ప్రభుత్వం గుర్తించి కౌల్దార్లను ఆదుకోవాలని కోరారు. వాస్తవ సాగుదార్లయిన కౌలురైతులకు పంట రుణాలివ్వడం లేదని అన్నారు. గూగుల్ సంస్థకి రూ.22 వేల కోట్ల సబ్సిడీ ఇచ్చారని, పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు రుణాలు మాఫీ చేశారని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో జరిగే ధర్నాకు కౌల్దార్లంతా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.వెంకటశివరావు, ఎం.వెంకటేశ్వర్లు, డి.రమేష్‌బాబు, కె.చంద్రరావు, పి.శేషగిరిరావు పాల్గొన్నారు.

# వృద్ధురాలి మెడలోని బంగారు నాంతాడు చోరీ



నవంబర్ 1(సందేశం టైమ్స్)::ముదినేపల్లి ఓ వృద్ధురాలి మెడలోని బంగారు నాంతాడు గుర్తు తెలీని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన సాయంత్రం మండలంలోని వడాలి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం%ొ% గ్రామానికి చెందిన వృద్ధురాలు నక్క సత్యవతి సాయంత్రం ఆరు గంటలకు వడాలి సెంటర్‌లో కిరాణా షాపు వద్దకు వెళ్లి ఇంట్లోకి కావాల్సిన సరుకులు కొనుక్కుని ఇంటికి తిరిగి వెళ్తూ ఉండగా ఇద్దరు వ్యక్తులు మోటారుసైకిల్ పై సత్యవతి వెనక వైపు నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు కాసుల బంగారు నాంతాడును లాక్కుని వెళ్లిపోయినట్లు సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చంద్రవంక ధాటికి కొట్టుకుపోయిన చప్టాలు



మాచర్ల :నవంబర్ 1(సందేశం టైమ్స్):మాచర్ల పట్టణం గుండా ప్రవహించే చంద్రవంక వాగు ఉధృతికి లోలెవల్ చప్టాలు కొట్టుకుపోయాయి. మొంథా తుఫాన్ కారణంగా మాచర్ల పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలకు చంద్రవంక వాగు పొంగిపొర్లింది. పట్టణం నండి జమ్మలమడకకు, అజాద్ నగర్‌కు వెళ్లే దారిలో చంద్రవంక వాగుపై రెండు లోలెవల్ చప్టాలు వాగు ఉధృతికి కొట్టుకుపోయాయి. అజాద్ నగర్‌కు వెళ్లే దారిలో చప్టాకొట్టుకుపోవటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినాయకునిగుట్ట, అజాద్‌నగర్ ప్రజలు పట్టణంలోకి వచ్చేందుకు ఎంతో ఉపయోగకరమైన చప్టా కొట్టుకుపోవటం వలన అవస్థలు పడుతున్నారు. మాచర్ల నుండి జమ్మలమడక దారిలోని లోలెవల్ చప్టా కూడా తీవ్రంగా దెబ్బతింది. జమ్మలమడక, లింగాపురం, తమ్మకోట గ్రామాలకు ఈ దారి గుండానే వాహన రాకపోకలు సాగుతుంటాయి. ఈ చప్టాను తాత్కాలికంగా కొట్టుకుపోయిన దిమ్మెలను సరిచేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. కొట్టుకుపోయిన బ్రిడ్జిలను మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, కమిషనర్ వేణుబాబు పరిశీలించారు. భారీ వాహనాలు వస్తే ఇబ్బందని, వెంటనే ఈ రెండు లోలెవల్ చప్టాలను పెద్ద బ్రిడ్జిలుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

# నది దాటించలేక..



మెంటాడ,నవంబర్ 1(సందేశం టైమ్స్): నాలుగు నెలల గిరిజన బాలుడు అనారోగ్యంలో చనిపోయాడు. తుఫాన్ కారణంగా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆ ఊరికి వెళ్లడానికి అది తప్ప వేరే మార్గంలేదు. దీంతో నది దాటలేక పొరుగూరులోనే కుటుంబీకులు ఆ బాలుడికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది.

మెంటాడ మండలం లోతుగెడ్డ గ్రామపంచాయతీ మధుర పోరపుబాడవ, దిబ్బగుడి గ్రామాలు చంపావతి నది ఆవల ఉన్నాయి. వీరు ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా నది దాటుకుని కొండపర్తి గ్రామానికి వచ్చి అక్కడి నుంచి వాహనాల్లో వెళ్లాలి. ఆదివారం పోరపుబాడవకు చెందిన నాలుగు నెలలు గిరిజన బాలుడు జనార్దన్ ఆదివారం కడుపునొప్పితో విలవిల్లాడి పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అప్పటికప్పుడు తెప్పపై చంపావతి నది దాటించి గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అక్కడి నుంచి విజయనగరం ఘోషా ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా.. అక్కడ కుదుట పడకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

# పది' ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి



నవంబర్ 1(సందేశం టైమ్స్)::ఏలూరు సిటీ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణతో సమావేశం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై ఇరువురు విశదంగా చర్చించారు. గత సంవత్సరం జిల్లా ఉతీర్తత 16 శాతం మాత్రమే ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ విద్యా సంవత్సరం దాన్ని గణనీయంగా పెంచేందుకు పాఠశాలల్లో బోధన నాణ్యత, పునర్విమర్శ తరగతులు, ప్రత్యేక పాఠాలు, మానిటరింగ్ వ్యవస్థ, తల్లిదండ్రుల సమావేశాలు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని ఛైర్‌పర్సన్ సూచించారు. ఈ సంవత్సరం తొమ్మిదో తరగతి పిల్లలకు పదో తరగతి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని, అదేవిధంగా ఈ నెల 26వ తేదీన విద్యార్థుల అవగాహన కోసం మోక్ పార్లమెంట్ నిర్వహణ వంటి అంశాలపై పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల కోసం రూపొందించిన విజయకేతనం పుస్తకాలను గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి మరింత ముందుగానే పంపిణీ చేస్తామని ఛైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ క్రీడా సామగ్రి పంపిణీ గురించి కూడా చర్చించారు. పిల్లల్లో క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ పెంచడంలో క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు జిల్లా పరిషత్, విద్యాశాఖ కలిసి సమన్వయంతో పని చేస్తాయని ఛైర్‌పర్సన్ తెలిపారు.

# కొత్తపట్నం-ఒంగోలు రోడ్డులో రాకపోకల పునరుద్ధరణ

**వరద నీటినిబయటకు పంపే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు**

**వరద నీటిని తొలగించే పనులను పరిశీలించిన కలెక్టర్**



కొత్తపట్నం,నవంబర్ 1(సందేశం టైమ్స్)::మండలంలోని కొత్తపట్నం–ఒంగోలు, ఈతముక్కల–సూరారెడ్డిపాలెం రహదారుల్లో గత మూడు రోజులుగా నిలిచిపోయిన రాకపోకలు పునరుద్ధరించారు. తుఫాన్ నేపథ్యంలో వరద నీరు ఆయా రోడ్లపై ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రమాదకర స్థాయిలో పారుతుండటంతో ఆర్టీసీ బస్సులను కూడా నిలిపివేశారు. దీంతో మూడు రోజుల పాటు కొత్తపట్నం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రహదారుల్లో వరద నీరు భారీ ప్రవహిస్తుండటం రోజుల తరబడి రాకపోకలు ఆగిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అత్యవసర వైద్యసేవలు అందక ఇబ్బందులుపడ్డారు. ఈక్రమంలో రహదారులపై చేరిన వరద నీటిని బయటకు పంపేందుకు అధికారులు తీసుకున్న చర్యలను కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలక్రిష్ట పరిశీలించారు. కొప్పోలు నుంచి అల్లూరు వరకు ఆయన వరద నీటి ఉధృతిని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

# ముందుచూపే కాపాడింది




విజయనగరం/కలెక్టరేట్, నవంబర్ 1(సందేశం టైమ్స్): జిల్లా అధికార యంత్రాంగం ముందుచూపే మొంథా తుఫాన్ నష్ట తీవ్రతను తగ్గించింది. పక్కా ప్రణాళిక, కచ్చితమైన ఆచరణ, నిరంతర పరిశీలన, పర్యవేక్షణ, తీసుకున్న చర్యలు కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం తగ్గింది. ముందుగానే ప్రజలను అప్రమత్తం చేయడంలో యంత్రాంగం సఫలీకృతమైంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, జేసీ సేతుమాధవన్ నిత్యం క్షేత్రస్థారు సిబ్బందిని అలెర్ట్ చేయడంతో ఈ పెను తుఫాన్ నష్ట తీవ్రత తగ్గింది. మంత్రితో పాటు కలెక్టర్ మూడు రోజుల పాటు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో తిష్ఠవేశారు. రాత్రి ఒంటిగంట వరకూ కంట్రోల్ రూమ్ నుంచి మానటరింగ్ చేస్తూ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ముందుగానే జిల్లాకు 1,900 విద్యుత్ స్తంభాలు, 360 ట్రాన్స్‌ఫార్మర్లు, 500 మంది సిబ్బందిని రిజ్వర్ చేశారు. అయితే మొంథాతో విద్యుత్ శాఖకు పెద్దగా నష్టం జరగలేదు. విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం కలగలేదు. 67 స్తంభాలు నేలకూలగా, 23 ఫీడర్లు దెబ్బతిన్నాయి. వీటికి రూ.4.5కోట్లు అవసరం పడుతుందని అధికారులు అంచనా వేశారు. గండిపడే అవకాశం ఉన్న 79 చెరువులపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గండిపడితే పూడ్చేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. మూడు రోజుల పాటు ప్రజలు ఇళ్లకు పరిమితం కావాలని, స్వీయ రక్షణ పాటించాలంటూ గ్రామాల్లో ప్రచారం చేయడం మంచి ఫలితాలను ఇచ్చింది. పూరిళ్లు, శిథిల భవనాల్లో ఉన్నవారిని సచివాలయాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించి వారికి వసతి, భోజనం సమకూర్చారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను గుర్తించి ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించారు. దీనివల్ల మేలు కలిగింది.

# పదేపదే బాంబు బెదిరింపులు.. ఆందోళనలో ప్రయాణికులు




హైదరాబాద్,నవంబర్ 1(సందేశం టైమ్స్): ఇండిగో విమానాలకు తరచుగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇండిగో విమానంలో బాంబులు ఉన్నట్లు బెదిరింపు మెయిల్స్ రావడం.. ఆ తరువాత అదంతా ఫేక్ అని తేలడం జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లుగా మెయిల్ రావడం ఆందోళన కలిగిస్తోంది. (శనివారం) జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో సెక్యూరిటీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన విమానాన్ని ముంబాయి ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. బాంబు బెదిరింపు మెయిల్‌పై పోలీసులకు సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.గత నెలలో కూడా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దుబాయ్ నుంచి మంగళూరు బయలుదేరిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు ఉన్న సందేశాలను ప్రయాణికులు గుర్తించి.. సిబ్బందికి తెలియజేశారు. వెంటనే అలర్ట్ అయిన విమానాశ్రయ సిబ్బంది.. విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని.. అందంతా ఫేక్ అని నిర్ధారణ కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా.. ఇండిగో విమానాలకు పదే పదే ఇలాంటి బెదిరింపులు రావడంపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు భావిస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తున్న ఆకతాయిలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ఇలాంటి సందేశాలతో భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

# విజిలెన్స్‌లో ఏఐ టాస్క్‌ఫోర్స్..



హైదరాబాద్ సిటీ:నవంబర్ 1(సందేశం టైమ్స్): అవినీతి అక్రమాలు, నేరాలను నియంత్రించే క్రమంలో విజిలెన్స్ శాఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేస్తే పారదర్శకత, ఉత్పాదకత పెరుగుతాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. సైదాబాద్ సింగరేణి భవన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు తగ్గాలంటే వ్యవస్థలో మౌలిక మార్పులు అవసరమన్నారు.%సింగరేణి సంస్థతో తనకు 25 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. జీఎస్టీ రంగారెడ్డి కమిషనరేట్ ప్రిన్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విజిలెన్స్ అంటే శిక్షించే శాఖ కాదు, సంస్కరించే శాఖగా రూపుదిద్దుకోవాలన్నారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించేలా, %అంతర్జాతీయంగా ఖనిజ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న, జీఎం టి.శ్రీనివాస్, జీఎంలు పాల్గొన్నారు.

# దారుణం.. రోడ్డుపై నగ్నంగా మొండెంతో మహిళ మృతదేహం




నిజామాబాద్, నవంబర్ 1(సందేశం టైమ్స్): జిల్లాలో మహిళ మృతదేహం తీవ్ర కలకలం రేపుతోంది. నవీపేట మండలం ఫకీరాబాద్ మిట్టాపూర్ శివారులో మొండెం లేని మహిళ డెడ్‌బాడీ లభ్యమైంది. బాసర ప్రధాన రహదారి సమీపంలో నగ్నంగా మహిళ మృతదేహం పడి ఉంది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు... ఓ చేయి, మరో చేతి వేళ్ళు, తల తొలగించి ఆమెను అతి కిరాతకంగా హత్య చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.అయితే మృతిచెందిన మహిళ ఎవరు?.. ఆమెను ఎక్కడో హత్య చేసి ఇక్కడ తీసుకొచ్చి పడేశారా?... డెడ్‌బాడీ నగ్నంగా ఉండటంతో అత్యాచారం ఏమన్నా జరిగిందా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కేవలం మొండెం మాత్రమే కనిపించడంతో మహిళ తల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతురాలి వివరాలను సేకరించే పనిలో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే మహిళకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి తెలియజేస్తామని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు నగ్నంగా, తల లేకుండా మొండెం మాత్రమే ఉన్న మహిళ మృతదేహాన్ని చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నెల వ్యవధిలో జిల్లాలో ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురవడం తీవ్ర సంచలనంగా మారింది.

# నవంబర్ కోటా రేషన్ బియ్యం రెడీ..



హైదరాబాద్ సిటీ: నవంబర్ 1(సందేశం టైమ్స్): నవంబరు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. బియ్యం స్టాకును రేషన్ షాపులకు తరలించామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 7,98,269 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. ఈ కార్డుల ద్వారా మొత్తం 30,42,056 మంది లబ్ధిదారులు జిల్లా పరిధిలో ఉన్నారు.%నవంబరు నెలకు సంబంధించి పంపిణీ చేయాల్సిన కోటా 17,102 టన్నుల సన్న బియ్యాన్ని గోదాంలలో సిద్ధంగా ఉంచారని, మొదటి విడతగా 8,500 టన్నుల బియ్యాన్ని నగరవ్యాప్తంగా 653 రేషన్ షాపులకు పంపించామని తెలిపారు. సన్నం బియ్యంతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో గోధుమలను రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తున్నామని, ఈనెల కోటా 3,400 టన్నులు కేటాయించామని తెలిపారు.

# బీసీ హాస్టల్‌లో 86 మంది విద్యార్థులకు అస్వస్థత




జోగులాంబ గద్వాల, నవంబర్ 1(సందేశం టైమ్స్):జిల్లాలోని ఓ బీసీ హాస్టల్‌కు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇటిక్యాల మండలం ధర్మవరంలోని బీసీ బాలుర వసతి గృహంలోని ఆహారం కలుషితమై 86 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహంలో మొత్తం 125 మంది విద్యార్థులు ఉండగా... 110 మంది హాజరయ్యారు. రాత్రి భోజనాలయ్యాక 9 గంటల తర్వాత 86 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి భోజనం తర్వాత సుమారు 30 మందికిపైగా విద్యార్థులకు వాంతులు చేసుకున్నారు. మరికొందరు కడుపు నొప్పితో బాధపడ్డారు.విద్యార్థులను గమనించిన హాస్టల్ సిబ్బంది వెంటనే వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. హాస్టల్ సిబ్బంది పోలీసులు 108 అబులెన్స్ లో విద్యార్థులను వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ విద్యార్థులను పరీక్షించిన వైద్యులు వారికి చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని, అందరూ సురక్షితంగా ఉన్నట్టు డాక్టర్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# నిషేధిత భూముల జాబితా రెడీ



హైదరాబాద్, నవంబర్ 1(సందేశం టైమ్స్): రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లోని నిషేధిత భూముల (22ఎ) జాబితా సిద్ధమైంది. జిల్లా కలెక్టర్లు ఆయా జిల్లాల పరిధిలో గ్రామాల వారీగా జాబితాలను సిద్ధం చేశారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ జాబితా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అందుబాటులోకి రానుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని మొత్తం 10,953 రెవెన్యూ గ్రామాలకుగాను 10,947 గ్రామాల నిషేధిత భూముల జాబితాను సిద్ధం చేశారు. ఇందులో 10,510 గ్రామాల జాబితాలను అప్‌లోడ్ కూడా చేశారు. కొన్ని జిల్లాల్లో అప్‌లోడ్ చేయకపోవడంపై రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్.. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే సాంకేతికపరమైన ఇబ్బందుల వల్లనే ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇచ్చిన ఫార్మాట్‌కు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం ఇచ్చిన ఫార్మాట్‌కు తేడాలు ఉండటం వల్ల అప్‌లోడ్ చేయడం వీలు కాలేదని బదులిచ్చారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 100% జాబితాలను అప్‌లోడ్ చేయాలని కార్యదర్శి ఆదేశించారు. ఏదైనా గ్రామానికి సంబంధించిన 22ఏ జాబితాను ధ్రువీకరించి.. సంతకం చేయడంలో కలెక్టర్లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హెచ్చరించడం అధికారుల్లో చర్చనీయాంశమయింది. 33 జిల్లాలకు సంబంధించి 10,510 రెవెన్యూ గ్రామాల (96%) 22ఏ జాబితా అప్‌లోడ్ చేశారు. ఇందులో 5 జిల్లాల్లో మాత్రమే 90% లోపు అప్‌లోడ్ చేశారు. రాజన్న సిరిసిల్లలో 171 గ్రామాలు ఉండగా.. 93 గ్రామాల వివరాలే అప్‌లోడ్ చేశారు. అక్కడ 54% అప్‌లోడ్ చేయగా, వరంగల్ జిల్లాలో 58% అయ్యాయి. ఈ జిల్లాలో 191 గ్రామాలకుగాను 110 గ్రామాల జాబితా అప్‌లోడ్ అయింది. జోగులాంబ గద్వాల జిల్లాలో 199 రెవెన్యూ గ్రామాలు ఉంటే 133 గ్రామాల జాబితాను (67%) అప్‌లోడ్ చేశారు. కాగా, వంద శాతం అప్‌లోడ్ చేసిన జిల్లాలు 16 ఉన్నాయి. అందులో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నారాయణపేట, మేడ్చల్ మల్కాజిగిరి, కుమరం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, నిర్మల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, పెద్దపల్లి ఉన్నాయి. కాగా, మరో ఏడు జిల్లాల్లో 99 శాతం జాబితాలను అప్‌లోడ్ చేశారు.

# ప్రభుత్వ సలహాదారుగా పి.సుదర్శన్‌రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 1(సందేశం టైమ్స్): క్యాబినెట్‌లో చోటు ఆశించిన ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రభుత్వం క్యాబినెట్ హోదాతో కీలక పదవులు ఇచ్చింది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారు (అభివృద్ధి, సంక్షేమ ఫ్లాగ్‌షిప్ పథకాల అమలు)గా నియమించింది. ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావును రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా నియమించింది. ఇద్దరికీ క్యాబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు.. సుదర్శన్‌రెడ్డి క్యాబినెట్ హోదాలో అన్ని క్యాబినెట్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరవుతారని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఇతర అధికారులతో సమీక్షించే అధికారాన్ని ఆయనకు దఖలు పరిచింది. మంత్రుల స్థాయిలో ఆయనకు నివాస భవనం, సచివాలయంలో మంత్రుల మాదిరిగా చాంబర్‌ను కూడా కేటాయించనున్నట్లు పేర్కొంది. జీత భత్యాలు, సిబ్బంది వంటి సౌకర్యాలు కూడా మంత్రుల స్థాయిలో ఉంటాయని తెలిపింది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని, సలహాదారు సుదర్శన్‌రెడ్డికి సచివాలయం నుంచి అవసరమైన సహకారం అందిస్తారని వివరించింది. సలహాదారు, కార్యదర్శి యూనిట్ మొత్తం.. పథకాల అమలుపై ఎప్పటికప్పుడు క్యాబినెట్‌కు వివరించాల్సి ఉంటుందని పేర్కొంది.

# తారవ్వ ధాన్యం కొనుగోలు

హుస్నాబాద్ రూరల్, నవంబర్ 1(సందేశం టైమ్స్): కష్టనష్టాలకోర్చి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి తెస్తే.. మొంథా తుఫాను ప్రభావంతో వరద పాలైన తారవ్వ ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కేడిక తారవ్వ తన ఐదెకరాల్లో పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి హుస్నాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చింది. తేమ పేరుతో తూకం వేయడానికి అధికారులు తాత్సారం చేయడంతో.. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆమె తెచ్చిన ధాన్యంలోంచి 80 శాతం పైగా కొట్టుకుపోయింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు.. తారవ్వ వద్ద నుంచి 106.80 క్వింటాళ్ల తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసిన పౌర సరఫరా అధికారులు, సాయంత్రం ఆమె భర్త రవీందర్‌రెడ్డి ఖాతాలో రూ.2.55 లక్షలను జమ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి తారవ్వ కృతజ్ఞతలు తెలిపారు. ఇక, తారవ్వకు కేంద్ర మంత్రి బండి సంజయ్ అండగా నిలిచారు. శుక్రవారం ఆయన ఢిల్లీ నుంచి తారవ్వతో ఫోన్‌లో మాట్లాడి.. తక్షణ సహాయం కింద రూ. 50 వేలు అందిస్తున్నట్లు తెలిపారు.



# క్రీడావార్తలు



## విజేతగా ఢిల్లీ..

## ఉత్కంఠ పోరులో పుణేరి పల్టాన్‌పై విజయం!





క్రీడా వార్తలు: ప్రొ కబడ్డీ సీజన్ 12 టైటిల్ ను దబాంగ్ ఢిల్లీ కైవసం చేసుకుంది. శుక్రవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో ఢిల్లీ 31-28 తేడాతో పుణేరి పల్టాన్‌ను ఓడించింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది. మ్యాచ్(%ూతీశీ ఖుఃఎుఎఐ నామ్పుస్త్రబవ% 2025) ఆరంభం నుంచి దబాంగ్ ఢిల్లీ ఆధిపత్యం చెలాయించింది. అయితే సెకండాఫ్‌లో అనూహ్యంగా తడబడింది. అనవసర ట్యాకిల్స్‌తో పాటు పేలవ రైడ్స్‌తో పాయింట్స్ సమర్పించుకోవడంతో పుణేరి పల్టాన్ రేసులోకి వచ్చింది. కానీ చివరి క్షణాల్లో పాయింట్స్ సాధించి ఢిల్లీ.. అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో ఢిల్లీ రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది.(ప్రొ కబడ్డీ సీజన్ 12 )ఫైనల్ మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన ఢిల్లీ తొలి అర్ధభాగంలోనే పుణేరి పల్టాన్ ఒకసారి ఆలౌట్ చేసి 20-14తో ఆధిక్యంలో నిలిచింది. రైడింగ్‌లో 13 పాయింట్స్ సాధించిన దబాంగ్ ఢిల్లీ 3 ట్యాకిల్ పాయింట్స్ అందుకుంది. ఇక రెండో అర్ధభాగంలో మాత్రం దబాంగ్ ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. రైడర్స్ విఫలమవ్వడంతో ప్రత్యర్థి చేతిలో ఒకసారి ఆలౌట్ అయ్యింది. దీంతో స్కోర్లు సమమై మ్యాచ్ పై అందరిలో ఉత్కంఠ పెంచింది. కానీ ఫజల్ అత్రాచలీ కీలక ట్యాకిల్ పాయింట్‌తో ఆధిక్యం అందించి విజయాన్ని ఖాయం చేశాడు. రెండో అర్ధభాగంలో ఢిల్లీ 4 రైడింగ్ పాయింట్స్‌తో పాటు 5 ట్యాకిల్ పాయింట్స్ సాధించగా.. పుణేరి 8 రైడింగ్ పాయింట్స్‌తో పాటు 3 ట్యాకిల్ పాయింట్స్ అందుకుంది.తొలి అర్ధభాగంలోని వైఫల్యం పుణేరి పల్టాన్‌ఓటమిని ఖరారు చేసింది. ఢిల్లీకి ఇది రెండో టైటిల్. 2021లో తొలిసారి టైటిల్ గెలిచింది. 12 సీజన్లలో పాట్నా పైరేట్స్ అత్యధికంగా మూడుసార్లు నెగ్గింది. ఢిల్లీ, జైపూర్, రెండేసి టైటిళ్లు సాధించగా.. యు ముంబా, పుణెరి పల్టాన్, హరియాణా స్టీలర్స్, బెంగళూరు బుల్స్, బెంగాల్ వారియర్స్ ఒక్కో ట్రోఫీ నెగ్గాయి. ఈ టోర్నీలో విజేత ఢిల్లీకి రూ.3 కోట్లు, రన్నరప్ పుణెరికి రూ.1.8 కోట్లు దక్కాయి. మరోవైపు ఈ సీజన్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన తెలుగు టైటాన్స్ క్వాలిఫయర్-2లోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.

## రెండు రోజుల్లో భారత్‌కు ఆసియా కప్: బీసీసీఐ




క్రీడా వార్తలు: ఆసియా కప్ 2025 ట్రోఫీ వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. దీనికి సంబంధించి రోజూ ఏదో ఒక అప్ డేట్ వస్తూనే ఉంది. తాజాగా ఈ ట్రోఫీపై మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ నఖ్వీ రెండు రోజుల్లో ట్రోఫీని భారత్‌కు అప్పగించే అవకాశముందని బీసీసీఐ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. టీమిండియా ఆసియా కప్ గెల్చి.. నెలరోజులు గడుస్తున్నా.. ఇంకా ట్రోఫీ, మెడల్స్‌ను అందించకపోవడంపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అసంతృప్తి వ్యక్తం చేశారు.వంబర్ 4న ఐసీసీ త్రైమాసిక సమావేశం(జరగనుంది. ఈలోగా నఖ్వీ ఆ ట్రోఫీని భారత్‌కు అప్పగించాలని, లేకపోతే ఈ విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకువెళతామని దేవజిత్ సైకియాహెచ్చరించారు. దాదాపు నెల గడుస్తున్నా.. ఇప్పటికీ ఆసియా ట్రోఫీని భారత్ కు అందించలేదని సైకియా ఓ న్యూస్ ఏజెన్సీతో అన్నారు. అలాగే ట్రోఫీ విషయమై ఏసీసీకి లేఖ పంపిన విషయాన్నీ కూడా ఆయన ధ్రువీకరించారు. ఏసీసీ కార్యాలయంలోనే ట్రోఫీని తీసుకోవాలని తమకు బదులిచ్చినట్లు దేవజిత్ తెలిపారు. తాము ఏసీసీ ఛైర్మన్‌కు ఆసియా కప్ ట్రోఫీ విషయమై లేఖ పంపామని, అయినా పరిస్థితిలో ఏ మార్పు రాలేదని అన్నారు. ఆసియా ట్రోఫీ ఇప్పటికీ నఖ్వీ స్వాధీనంలోనే ఉందని ఒకట్రెండు రోజుల్లో తప్పకుండా అది ముంబయిలోని బీసీసీఐకార్యాలయానికి వస్తుందని సైకియా ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక ఆసియా కప్2025 విషయానికి వస్తే.. ఈ టోర్నీలో భారత్ మొత్తంగా మూడుసార్లు పాకిస్థాన్‌తో తలపడితే, అన్ని మ్యాచ్‌లనూ టీమిండియా గెలిచింది. ఫైనల్‌లోనూ పాక్‌పై గెలిచి.. ట్రోఫీని కైవసం చేసుకుంది. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్ ఆడగాళ్లు, పాక్ ప్లేయర్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించారు. అలాగే ఆదేశానికే చెందిన ఏసీసీ చీఫ్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు కూడా ఇష్టపడలేదు. ఈ క్రమంలో నఖ్వీ పిల్ల చేష్టలకు పాల్పడ్డాడు. ట్రోఫీ, మెడల్స్‌ను మైదానం నుంచి తనతోపాటు తీసుకెళ్లాడు.

## కోహ్లీ రెస్టారెంట్ మెనూ.. ప్లేట్ బిర్యానీ రేటెంతో తెలిస్తే షాకే..




ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనదైన బ్యాటింగ్ తో ప్రపంచ వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించాడు. క్రికెట్ లో రాణిస్తున్న కోహ్లీ.. . కొన్నేళ్ళ క్రితం 'వన్ 8 కమ్యూన్' (పేరుతో చైన్ రెస్టారెంట్ బిజినెస్ ను ప్రారంభించాడు.ముంబైలోని జుహూ ప్రాంతంలో దివంగత లెజెండరీ సింగర్ కిశోర్ కుమార్ బంగ్లాను రీమోడల్ చేసి, అక్కడ ఈ రెస్టారెంట్ ను ప్రారంభించాడు. విభిన్నమైన ఫుడ్ ఐటెమ్స్ తో అదరగొడుతున్న ఈ రెస్టారెంట్ లో రేట్లు మాత్రం ఎక్కువేనన్న టాక్ వినిపిస్తోంది. తాజాగా కోహ్లీ రెస్టారెంట్ కు సంబంధించిన మెనూ నెట్టింట వైరల్ గా మారింది. ఒక ప్లేట్ బిర్యానీ రేటు చూసి నెటిజన్లు నోరెళ్ల బెడుతున్నారు.సాధారణ హోటల్స్ లో ప్లేట్ చికెన్ బిర్యానీ రూ.100 నుంచి రూ.150 వరకు ఉంటుంది. అలాగే ఒక చపాతీ లేదా రోటీ రూ.20 నుంచి రూ.40 వరకు ఉంటుంది. అదే కాస్తా పెద్ద హోటల్స్ లేదా రెస్టారెంట్లో అయితే బిర్యానీ రూ.300- రూ.400, చపాతీ , తందూరీ రూ.40 నుంచి రూ. 70 వరకూ ఉంటుంది. కానీ కోహ్లీ రెస్టారెంట్లో మాత్రం వీటి రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి.తందూరీ రోటీ, బేబీ నాన్ ధర రూ.118, సాల్టెడ్ ఫ్రైస్ ధర రూ.348, లక్నో దమ్ ల్యాంబ్ బిర్యానీధర రూ. 978, చికెన్ చెట్టినాడ్ బిర్యానీ ధర రూ. 878, ఒక ప్లేట్ ప్లెయిన్ రైస్ ధర రూ.318 గా ఉంది. ఇక్కడ అత్యంత ఖరీదైన వంటకం నాన్ వెజ్ ల్యాంబ్ షాంక్. దీని రేటు రూ.2318గా ఉంది. అలానే మస్కార్పోన్ చీజ్ కేక్ రూ.748, కోహ్లీ స్పెషల్ చాక్లెట్ మౌస్ రూ.818, సిగ్నేచర్ సిజ్లింగ్ క్రోసెంట్ ధర రూ.918గా ఉన్నాయి. ఈ రెస్టారెంట్ కు సంబంధించిన మెనూ జొమాటోలో అందుబాటులో ఉంది.

## మా ఓటమికి కారణం అతడే..!




ఇంటర్నెట్ డెస్క్: భారత్‌తో జరిగిన రెండో టీ-20 లో ఆస్ట్రేలియా విజయం సాధించింది. ఆసీస్ బౌలర్లు విరుచుపడిన వేళ టీమిండియా బ్యాటర్లు చేతులెత్తేశారు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆసీస్ నాలుగు వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. 13.2 ఓవర్లలోనే అలవోక విజయాన్ని నమోదు చేసింది.నంతరం తమ పరాజయంపై కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడాడు. 'జోష్ హేజిల్‌వుడ్ కారణంగానే ఈ మ్యాచ్ ఓడిపోయాం. అతడు చాలా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు తీసి మమ్మల్ని కోలుకోలేని దెబ్బ తీశాడు. అభిషేక్ శర్మ మినహా నాతో సహా మిగతా బ్యాటర్లంతా హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో చేతులెత్తుశారు. అభిషేక్ శర్మ మంచి నాక్ ఆడాడు. అతడికి తన ఆట పట్ల ఓ క్లారిటీ ఉంది. అన్ని మ్యాచ్‌ల్లోనూ ఇదే జోరు కొనసాగిస్తాడని ఆశిస్తున్నాం. టాస్ మమ్మల్ని అన్నిసార్లూ నిరాశపరుస్తోంది. ముందుగా బ్యాటింగ్ చేస్తే భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఆపై ఫీల్డింగ్‌లో ఆ స్కోరుని కాపాడుకోవాలి. వేం ఈ రెండు చేయలేకపోయాం. అందుకే ఓడిపోయాం' అని సూర్య వ్యాఖ్యానించాడు.టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కంగారూ జట్టు ఆది నుంచే అటాకింగ్ చేసింది. జోష్ హేజిల్‌వుడ్ పవర్ ప్లేలోనే మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అభిషేక్ శర్మ(68), హర్షిత్ రాణా(35) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. శుభ్‌మన్ గిల్(5), శాంసన్(2), సూర్య కుమార్ యాదవ్(1), తిలక్ వర్మ(0) తీవ్రంగా నిరాశపర్చారు. దీంతో 125 పరుగులకే టీమిండియా ఆలౌటైంది.

## రెండో టీ-20.. గెలుపు ఆసీస్‌దే..




ఇంటర్నెట్ డెస్క్: మెల్‌బోర్న్ వేదికగా భారత్‌తో జరిగిన రెండో టీ-20 లో ఆస్ట్రేలియా నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. టీమిండియా బ్యాటర్లు ఈ మ్యాచ్‌లో ఘోరంగా విఫలమయ్యారు. అభిషేక్ శర్మ(68), హర్షిత్ రాణా(35) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రెండు అంకెల స్కోర్ చేయలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ పవర్ ప్లేలోనే మూడు వికెట్లు తీసి భారత్ టాప్ ఆర్డర్‌ను వరుసగా పెవిలియన్ పంపాడు.మొదటి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ(68) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఓ పక్క వరుసగా వికెట్లు పడుతున్నా ఒత్తిడికి గురి కాకుండా షాట్లు ఆడుతూనే వచ్చాడు. టాప్ ఆర్డర్ అంతా కుప్పకూలిన సమయంలో నంబర్ 7లో వచ్చిన హర్షిత్ రాణా(35) పర్వాలేదనిపించాడు. వీరి భాగస్వామ్యంతోనే టీమిండియా ఓ మోస్తరు స్కోరైనా చేయగలిగింది. శుభ్‌మన్ గిల్(5), సంజూ శాంసన్(2), సూర్యకుమార్ యాదవ్(1), తిలక్ వర్మ(0), అక్షర్ పటేల్(7) ఘోరంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో హేజిల్‌వుడ్ 3, బ్రేట్‌లెట్, నాథన్ ఎల్లిస్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. స్టోయినిస్ ఒక వికెట్ తీశాడు.టీమిండియా నిర్దేశించిన 125 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్(46), ట్రావిస్ హెడ్(28), ఇంగ్లిస్(20) రాణించారు. దీంతో 13.2 ఓవర్లలోనే 126 పరుగుల లక్ష్యాన్ని నాలుగు వికెట్ల తేడాతో ఆసీస్ ఛేదించి విజయం సాధించింది. భారత బౌలర్లలో బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

## అదే జరిగితే జెమీమాతో కలిసి పాడతా: గావస్కర్




ఇంటర్నెట్ డెస్క్: ఐసీసీ వన్డే మహిళల ప్రపంచ కప్ 2025లో భాగంగా గురువారం ఆసీస్‌తో జరిగిన రెండో సెమీస్‌లో టీమిండియా(సంచలన విజయం నమోదు చేసింది. దీంతో ఆదివారం సౌతాఫ్రికాతో ఫైనల్‌లో తలపడనుంది. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్(%ూబఅఅశ్రీ అభిమానులకు ఓ క్రేజీ హామీ ఇచ్చాడు. సెమీస్‌లో అజేయంగా సెంచరీ చేసిన జెమీమా రోడ్రిగ్స్(%జీవఎఅఎఖష్ట =శీసతీఅస్త్రబవం%)తో కలిసి పాట పాడతానని వెల్లడించాడు. అందుకు జెమీమా అంగీకరిస్తేనే అని స్పష్టం చేశాడు. ఇంతకు ముందు భారత పురుషుల జట్టు టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు సన్నీ మైదానంలోనే డ్యాన్స్ చేసిన సంగతి తెలిసిందే.'భారత్ వన్డే ప్రపంచ కప్‌ను గెలిస్తే నేను జెమీమాతో కలిసి పాట పాడుతా. ఆమె గిటార్ అద్భుతంగా వాయిస్తుంది. గిటార్ వాయిస్తూ ఉంటే నేను సింగర్‌గా మారుతా. మేమిద్దరం కొన్నాళ్ల కిందట బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్నాం. అక్కడ బ్యాండ్ ప్లే అవుతూ ఉంటే మేమిద్దరం జాయిన్ అయ్యాం. జెమీమా గిటార్ ప్లే చేసింది. నేను నా వాయిస్‌తో ఏదో పాడేశా. అందుకే అభిమానులకు హామీ ఇస్తున్నా. మన జట్టు కప్ గెలిస్తే మరోసారి ప్రదర్శన ఇస్తాం. అయితే, ఈ ఓల్డ్‌మ్యాన్‌తో కలిసి ప్లే చేయడం జెమీమాకు ఇష్టం అయితేనే సుమా..' అని గావస్కర్ సరదాగా వ్యాఖ్యానించాడు.

## రెండో టీ20.. కుప్పకూలిన టాప్‌ఆర్డర్




మెల్‌బోర్న్, అక్టోబర్ 31: ఆసీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో టీ20 మెల్‌బోర్న్ వేదికగా కొనసాగుతోంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో టీమిండియా బ్యాటింగ్‌కు దిగింది. వర్షం కారణంగా తొలి టీ20 రద్దు అయిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో వర్షం అడ్డు పడటం సంగతి పక్కన పెడితే.. టీమిండియా బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు.భారత్‌కు మూడో ఓవర్ నుంచే షాక్‌లు తగులుతూ వస్తున్నాయి. గత మ్యాచ్‌లో అద్భుతంగా ఆడిన శుభ్‌మన్ గిల్(5) ఈసారి విఫలమయ్యాడు. జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ చేతికి క్యాచ్ ఇచ్చి గిల్ వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్‌లోనే సంజు శాంసన్(2) నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో ఎల్బీ అయ్యాడు. స్వల్ప వ్యవధిలోనే కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్(1)ను హేజిల్‌వుడ్ ఔట్ చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కి తిలక్ వర్మ.. జట్టును ఆదుకుంటాడు అనుకుంటున్న సమయంలో బ్యాట్‌కు పనే చెప్పకుండా డకౌట్ అయ్యాడు.అభిషేక్ శర్మ(48లి)తో కలిసి అక్షర్ పటేల్(7) ముందుకు నడిపిస్తున్నాడు అనుకునే లోపే.. రనౌట్ రూపంలో అక్షర్ ఔటయ్యాడు.

# బిజినెస్



## తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర..



ఇంటర్నెట్ డెస్క్: నిత్యావసర వస్తువుల్లో చాలా కీలమైన గ్యాస్ సిలిండర్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. తదనుగుణంగా ఈ ధరలను ప్రతి నెల ఒకటో తేదీన సవరిస్తుంటారు. ఈ క్రమంలో నవంబర్ 1వ తేదీ నుంచి దేశంలోని ప్రధాన నగరాల్లో గ్యాస్ ధరల్లో మార్పులు వచ్చాయి.గృహ వినియోగం కోసం ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు జరగలేదు. కమర్షియల్ సిలిండర్ల ధరలు మాత్రం కొంత మేర ఈ నెలలో తగ్గించారు. 19 కిలోల వాణిజ్య అవసరాలకోసం వాడే %ట్రూ+% సిలిండర్ ధర ఐదు రూపాయలు తగ్గింది.ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,590.50 ఉంది. గతంలో రూ.1,595.50 గా ఉండేది. కోల్‌కతాలో ప్రస్తుత ధర రూ.1,694, ముంబైలో రూ.1,542, చెన్నైలో రూ.1,750. హైదరాబాద్‌లో రూ.1,812.50 ఉంది.ఇక, గృహ వినియోగ %ట్రూ+% సిలిండర్ల ధరలు గత నెలలో లాగనే కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వంట గ్యాస్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య ఉంది. ఢిల్లీలో రూ.853, ముంబైలో రూ.852.50, హైదరాబాద్‌లో రూ.905 ఉంది.

## మళ్లీ గోల్డ్ రేట్స్‌కు రెక్కలు.. నేటి ధరలు ఇవీ




ఇంటర్నెట్ డెస్క్: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లల్లో కోతలు ఉండవన్న అంచనాలు, కేంద్ర బ్యాంకులు బంగారం నిల్వలను పెంచుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో, సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారానికి క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట ప్రకారం, నేడు (శనివారం) ఉదయం 7 గంటలకు దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,23,290గా ఉంది. నిన్నటితో పోలిస్తే సుమారు రూ.వెయ్యి మేర పెరిగింది. 22 క్యారెట్ 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర కూడా దాదాపు ఇదే స్థాయిలో పెరిగి రూ.1,13,010కు చేరుకుంది %పరిశ్రమల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1,50,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ బంగారం స్పాట్ ధర 4,004 డాలర్లుగా ఉంది. ఎమ్‌సీఎక్స్‌లో డిసెంబర్ గోల్డ్ (10 గ్రాములు) ఫ్యూచర్స్ ధరలు రూ.1.21 లక్షల వద్ద, కిలో వెండి ఫ్యూచర్స్ ధర రూ.1.48 లక్షల వద్దా తచ్చాడుతోంది.

## అలర్ట్.. నవంబర్‌లో ఏకంగా 12 రోజుల పాటు బ్యాంకులకు సెలవు




ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుతం బ్యాంకు పనులు అనేకం ఫోన్‌లోనే చక్కబెట్టేస్తున్నాం. కానీ, కొన్ని ముఖ్యమైన పనులకు ఇప్పటికీ బ్యాంకుకు వెళ్లాల్సిందే. ఈ నేపథ్యంలో బ్యాంకు సెలవులపై స్పష్టమైన అవగాహన ఉండాలి. లేకపోతే.. పనులు వాయిదా పడి చికాకులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక ఈ నెలలో ఏకంగా 12 రోజుల పాటు బ్యాంకులకు సెలవులు రానున్నాయి. ఈ సెలవులు ఎప్పుడో తెలుసుకుని పక్కాగా షెడ్యూల్ ప్లాన్ చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకావు

%నవంబర్ 1: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్ణాటకలో నవంబర్ 1న అన్ని బ్యాంకులకూ సెలవు. బుద్ధి దీపావళి నేపథ్యంలో ఈ రోజు డెహ్రాడూన్‌లో కూడా బ్యాంకులకు సెలవు.

నవంబర్ 5: గురునానక్ జయంతి, కార్తీక పూర్ణిమ, రహాస్ పూర్ణిమ నేపథ్యంలో ఐజ్వాల్, బెలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, డెహ్రాడూన్, హైదరాబాద్, ఇటానగర్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోహిమా, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, రాంచీ, షిమ్లా, శ్రీనగర్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి.

నవంబర్ 7: వంగల పండుగను పురస్కరించుకుని ఈ రోజు కూడా షిల్లాంగ్ నగరంలో బ్యాంకులకు సెలవు

నవంబర్ 8: కనకదాస జయంతి నేపథ్యంలో బెంగళూరులో ఈ రోజు బ్యాంకులకు సెలవు.

నవంబర్ 11: లహాబ్ ద్యూచెన్ పండుగను పురస్కరించుకుని సిక్కింలో ఈ రోజు బ్యాంకులకు సెలవు

నవంబర్ 25: గురు తేజ్ బహదూర్ జీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పంజాబ్, హర్యానా, చండీగఢ్‌లో బ్యాంకులు బంద్.

నవంబర్ 8, నవంబర్ 22: రెండు, నాలుగో శనివారం కావడంతో ఈ రోజుల్లో దేశవ్యాప్తంగా బ్యాంకులన్నిటికీ సెలవు.

నవంబర్ 2, నవంబర్ 9, నవంబర్16, నవంబర్ 23: ఆదివారం నాడు దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

ఈ సెలవు రోజుల్లో బ్యాంకులు మూసే ఉన్నప్పటికీ ఆన్‌లైన్, మొబైల్ సేవలన్నీ యథాతథంగా అందుబాటులో ఉంటాయి. అత్యవసర సమయాల్లో ఏటీఎమ్‌ల నుంచి నగదును విత్‌డ్రా చేసుకోవచ్చు. బ్యాంకు సెలవులకు సంబంధించి రిజర్వ్ బ్యాంకు ఏటా క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

## భారత బ్యాంకింగ్ రంగంలో మరో పెద్ద డీల్!




ఇంటర్నెట్ డెస్క్: భారతీయ ప్రైవేట్ బ్యాంకింగ్ సెక్టార్‌లో మరో పెద్ద డీల్ జరుగబోయే సూచనలు కనిపిస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దుబాయ్ బేస్డ్ ఎమిరేట్స్ %చీదీణ% బ్యాంక్ ఈ కొత్త డీల్ చేయబోతున్నట్టు సమాచారం. బ్యాంక్‌లో 60 శాతం మెజారిటీ స్టేక్‌ను స్వాధీనం చేసుకోవాలని %చీదీణ% చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది.ఎమిరేట్స్ %చీదీణ, ఖాూజు%లోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటి. అనుకున్నట్టుగానే ఈ డీల్ విజయవంతమైతే, ప్రమోటర్ కేటగిరీ లేకుండా వంద శాతం పబ్లిక్ షేర్‌హోల్డర్లు కల్గిన %=దీూ% బ్యాంక్‌లో విదేశీ ఇన్వెస్టర్ ఎంట్రీ ఇచ్చినట్టు అవుతుంది. భారతదేశంలోని %=దీూ% బ్యాంక్‌లో 60% స్టేక్‌ను సుమారు 3 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయడానికి ఎమిరేట్స్ బ్యాంకు సిద్ధమవుతోంది. ఈ ట్రాన్సాక్షన్ పూర్తిగా ఫ్రెష్ ఎక్విటీ ఇస్యూయన్స్ ద్వారా జరుగుతుందని నివేదికలు సూచిస్తున్నాయి.%ఈ ప్రక్రియలో, కంపెనీ తన షేర్ హోల్డర్లకు లేదా ఇతర ఇన్వెస్టర్లకు కొత్త షేర్లను అందజేస్తుంది. దీనివల్ల ఆ ఇన్వెస్టర్లు కంపెనీలో యాజమాన్య హక్కులను పొందుతారు. సదరు కంపెనీ ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న షేర్లను అమ్మడం కాకుండా , బదులుగా కొత్త షేర్లను జారీ చేస్తుంది. ఈ నిధులు సాధారణంగా కంపెనీ వృద్ధికి, విస్తరణకు, లేదా ఆర్థిక స్థిరత్వానికి ఉపయోగిస్తారు. మార్గదర్శకాల ప్రకారం, విదేశీ బ్యాంకులు భారతీయ ప్రైవేట్ బ్యాంకుల్లో 49 శాతం వరకు స్టేక్‌ను సొంతం చేసుకోవచ్చు. అయితే మెజారిటీ స్టేక్ కోసం ప్రత్యేక అనుమతులు అవసరమవుతాయి. ఈ డీల్ బ్యాంక్‌కు మరింత క్యాపిటల్ అందించి, ఆ సంస్థ ఇంకా బలోపేతం అవడానికి ఆస్కారం ఉంటుంది.ఇలాఉంటే, ఎమిరేట్స్ %చీదీణ% వంటి గ్లోబల్ ప్లేయర్ ప్రవేశంతో, భారత–మధ్యప్రాచ్య బ్యాంకింగ్ టై–అప్‌లు మరింత బలపడతాయని ఆర్థిక నిపుణుల అంచనా. ఈ భారీ డీల్ భారతీయ బ్యాంకింగ్ రంగంలో పెరుగుదలకు ఊతమిస్తుంది.

## వేల కోట్ల విలువైన ఐపీవోల విడుదల.. ఎప్పుడంటే..?




బిజినెస్ డెస్క్: దేశంలోని వివిధ కంపెనీలు తమ ఐపీవోలను స్టాక్ మార్కెట్‌లోకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాయి. వీటిని నవంబర్‌లో తీసుకురావాలని ఆయా కంపెనీలు నిర్ణయించాయి. దీంతో సుమారు రూ.76,000 కోట్ల విలువైన పబ్లిక్ ఇష్యూలు రావచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. టెక్నాలజీ, రెన్యూవబుల్స్, కన్స్యూమర్ గూడ్స్, హెల్త్ కేర్ తదితర రంగాలకు చెందిన సంస్థల వస్తుండడంతో పెట్టుబడిదారుల్లో ఉత్సాహం పెరిగింది. ఈ అక్టోబర్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు 5 శాతానికి పైగా పెరగడంతో మార్కెట్‌పై మదుపరులకు నమ్మకం పెరిగింది. ఈ ఉత్సాహాన్ని గమనించిన పలు కంపెనీలు.. తమ షేర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి తమ ప్రయత్నాలను ప్రారంభించాయి.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ.. రూ.10,000 కోట్లు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ.. దేశంలోని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ సంస్థ. ఈ నవంబర్‌లో భారీ ఐపీవోకు సిద్ధమవుతోంది. ఐసీఐసీఐ బ్యాంక్ 51 శాతం వాటా, ప్రుడెన్షియల్ పీఎల్‌సీ 49 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఇక ఈ సంస్థకు 1.46 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. అలాగే 93 శాతం లావాదేవీలు డిజిటల్ రూపంలో జరుగుతున్నాయి. ఫైనాన్షియల్‌గా 80 శాతం పైగా రిటర్న్ ఆన్ ఈక్విటీ ఉంది. ఐపీవో ఆస్తి నిర్వహణ రంగంలో పెద్ద మైలురాయిగా భావిస్తున్నారు.

గ్రో.. రూ.6,600 కోట్లు

గ్రో.. ఫిన్‌టెక్ దిగ్గజం. ఈ సంస్థ నవంబర్‌లో రూ. 6,000 నుంచి రూ.8,300 కోట్లు ఐపీవో తెస్తోంది. ఇక ఈ సంస్థ విలువ సుమారు 7 నుంచి 9 బిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ సంస్థకు 5 కోట్లకు పైగా రిజిస్టర్డ్ యూజర్లు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1,819 కోట్ల నికర లాభాం సాధించింది. ఈ సంస్థ తాజాగా వెల్త్ మేనేజ్‌మెంట్, ఈటీఎఫ్‌లు, కార్పొరేట్ బాండ్లు తదితర కొత్త సేవలను ప్రారంభించింది.

పైన్ లాబ్స్.. రూ. 6,100 కోట్లు

పేమెంట్ సొల్యూషన్ సంస్థ పైన్ లాబ్స్. ఈ సంస్థ సుమారు రూ.6,664 కోట్ల ఐపీవోకు సిద్ధమవుతోంది. ఇందులో పీక్ ఎక్స్వీ పార్ట్‌నర్స్, మాస్టర్ కార్డ్, టెమాసెక్ వంటి ఇన్వెస్టర్లు నుంచి ఆఫర్ ఫర్ సేల్ ఉంటుంది. ఈ సంస్థ భారత్, సౌత్ ఈస్ట్ ఏషియా, యూఏఈల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7.53 లక్షల కోట్ల లావాదేవీలను నిర్వహించింది.

బోట్.. రూ. 2000 నుంచి రూ.2,200 కోట్లు

ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎలక్ట్రానిక్స్ బ్రాండ్.. బోట్ సెబీ అనుమతి పొందింది. దాంతో నవంబర్‌లో ఐపీవోకు రెడీ అయ్యింది. ఈ సంస్థకి ఆడియో మార్కెట్‌లో 32 శాతం, స్మార్ట్ వాచ్ మార్కెట్‌లో 15 శాతం వాటా ఉంది. ఆ క్రమంలో రూ.1,200 కోట్ల ఫ్రెష్ ఇష్యూ, మిగిలిన భాగం ఆఫర్ ఫర్ సేల్‌గా ఉంటుంది. అయితే సేకరించిన నిధులను అప్పు తీర్చడంలో.. ఆఫ్ లైన్ విస్తరణలో.. ఆర్ అండ్ డీ పెట్టుబడులకు వినియోగించనుంది.దిశను చూపనుంది.

## సూపర్ స్కీమ్..రూ.12,500 పెట్టుబడితో.. చేతికి రూ. 1.33 కోట్లు

లబిజినెస్ న్యూస్: ప్రతి ఒక్కరు జీవితంలో ఆర్థికంగా మంచి స్థితిలో ఉండాలని కోరుకుంటారు. అలానే పెళ్లైన జంటలకు కూడా తమ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక స్కీమ్స్ అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే మనం చాలా రకాల పథకాల గురించి తెలుసుకున్నాము. అయితే తాజాగా పెళ్లైన జంట కోసం ఓ సూపర్ స్కీమ్ ఉంది. ఈ పథకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చు.పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. పీపీఎఫ్‌లో ఉమ్మడి ఖాతా సౌకర్యం లేదు. కానీ దంపతులారి పేర్లపై వేర్వేరు అకౌంట్లను తెరవచ్చు. ఏడాదికి ఒక్కొక్కరు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెడితే.. అది ఇద్దరి మీద రూ. 3 లక్షలు అవుతుంది. సంవత్సరానికి రూ. 1.50 లక్షలు అంటే నెలకు రూ. 12,500 పెట్టుబడి అవుతుంది. ఇక 20 ఏళ్ల మెచ్యూరిటీ కాలానికి మొత్తం పెట్టుబడి రూ. 60 లక్షలు అవుతుంది. 7.1 శాతం వడ్డీ రేటుతో చక్రవడ్డీతో కలిపి ఈ మొత్తం దాదాపు రూ. 1.33 కోట్లు అవుతుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఎటువంటి మార్కెట్ రిస్క్ లేకుండా భార్యాభర్తలు లక్షాధికారులు కావచ్చు.పీపీఎఫ్ పెట్టుబడి ‘ సౌకర్యంతో వస్తుంది. పెట్టుబడి పన్ను రహితం , వడ్డీ పన్ను రహితం, మెచ్యూరిటీ మొత్తానికి కూడా పన్ను మినహాయింపు ఉంటుంది. పీపీఎఫ్ అకౌంట్ 15 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ అవుతుంది. కానీ మీరు దానిని 5 ఏళ్లు పొడిగించవచ్చు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006